
(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నామినేటెడ్ పండుగ

గతంలో ప్రకటించిన పదవులకు గ్రీన్‌సిగ్నల్

- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఆరుగురికి అవకాశం
- పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రోజే ప్రకటన.. ఇన్నాళ్లకు ఉత్తర్వులు జారీ
- లోక్‌సభ టికెట్ త్యాగం చేసిన, ఇతర కీలక నేతలకు దక్కని పోస్టులు
- రెండో విడతలో పదవుల ప్రకటనపై కాంగ్రెస్ నేతల్లో ఉత్కంఠ
- రాష్ట్ర స్థాయి తరువాత 'జిల్లా పదవుల' ప్రకటన


రియాజ్ | బెల్లయ్యనాయక్ | జంగా రాఘవరెడ్డి | పొదెం వీరయ్య | ఇనుగాల వెంకట్రామిరెడ్డి | ఐత ప్రకాశ్‌రెడ్డి

కాంగ్రెస్‌లో పదవుల కోలాహలం నెలకొంది. మార్చి 16వ తేదీన ప్రకటించిన నామినేటెడ్ పదవులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రత్యేకంగా జీవోలను విడుదల చేయటంతో నామినేటెడ్ పదవులు పొందిన నేతలు, వారి అనుచరుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇక లాంఛనంగా పదవీబాధ్యతలు స్వీకరించేందుకు చకచకా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పదేళ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవులపై కీలక నేతలు ఆశలు పెట్టుకున్నారు. తొలివిడతలో ఆరుగురికి నామినేటెడ్ బెర్త్‌లు ఖరారవడంతో ఇక రెండో విడత నామినేటెడ్ పోస్టులపై ఉత్కంఠ నెలకొంది. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన నేతలతో పాటు కీలక నేతలు తమకు కూడా నామినేటెడ్ పదవులు వస్తాయనే ఆశతో ఉన్నారు. రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్టుల భర్తీ తరువాత జిల్లా స్థాయి పదవులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది.

ఆ ఆరుగురు ఎంపికకు గ్రీన్‌సిగ్నల్

రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పదేళ్ల తరువాత రాష్ట్రంలో అధికారంలోకి రావటంతో అనేక మంది సీనియర్ నేతలతో పాటు గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సామాజిక, ఇతర సమీకరణల నేపథ్యంలో టికెట్ రాని నేతలకు నామినేటెడ్ పదవులతో అధికారం అప్పగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేసింది. పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చిన రోజునే మార్చి 16న రాష్ట్ర వ్యాప్తంగా 37మందికి నామినేటెడ్ పోస్టులను ఖరారు చేస్తూ ప్రకటన చేసింది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఆరుగురికి చోటు దక్కింది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్రస్థాయిలో చైర్మన్ పదవులు దక్కించుకున్న నేతలకు కుర్చీలో కూర్చునే అవకాశం లేకుండా పోయింది. ఆ తరువాత జూన్ 6వ తేదీన ఎన్నికల కోడ్ పూర్తయినప్పటికీ నామినేటెడ్ పోస్టులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవటంతో తమ పోస్టులు ఉన్నట్టా.. లేనట్టా అనే డైలమాలో పడిపోయారు. ఎట్టకేలకు గతంలో ప్రకటించిన వారికే నామినేటెడ్ పదవులని కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో పాటు పాత తేదీల్లోనే నామినేట్ అయిన వారికి సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదవులు పొందిన నేతలు, వారి అనుచరుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఎవరెవరికి ఏ పదవులంటే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యంత కీలక పదవిగా భావించే కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ పదవి ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ఇనుగాల వెంకట్రామిరెడ్డికి దక్కింది. అలాగే సీనియర్ నేత జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ పదవి, మరో సీనియర్ నేత, ఉద్యమకారుడు రియాజ్‌కు రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ పదవి దక్కింది. అలాగే మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆశించిన సీనియర్ నేత బెల్లయ్య నాయక్‌కు గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ట్రైకా) చైర్మన్ పదవి దక్కింది. అలాగే ములుగు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి, భూపాలపల్లి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాష్‌రెడ్డికి స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. ఈ ఆరుగురికి పదవులను ఖరారు చేస్తూ ఉత్తర్వులు వెలువడటంతో పదవీబాధ్యతలు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కుడా చైర్మన్‌గా నియమించిన ఇనుగాల వెంకట్రామిరెడ్డి సోమవారం సాయంత్రమే పదవీబాధ్యతలను స్వీకరించారు. దీంతో నామినేటెడ్ పదవులు పొందినే నేతల అనుచరుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రెండో విడతపైనే కీలక నేతల ఆశలు

నామినేటెడ్ పదవులపై పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఆశలు పెంచుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రకటించిన జాబితాను యథావిధిగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో అనేక మంది అనేక విధాలుగా త్యాగాలు చేయాల్సి వచ్చింది. వారిలో ప్రధానంగా సీనియర్ నేతలు దొమ్మాటి సాంబయ్య, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, శనిగరపు ఇందిర ఉన్నారు. ఈ ముగ్గురు నేతలకు కీలక పదవులు ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మెజార్టీ ఎమ్మెల్యేలు అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకవస్తున్నారు. వీరితో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌లను త్యాగం చేసిన మాజీ మావోయిస్టు నేత గాజర్ల ఐతూ అలియాస్ అశోక్, నమిండ్ల శ్రీనివాస్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ తదితరులున్నారు. వీరికి కూడా ప్రభుత్వంలో భాగస్వామ్యం కలిగించేందుకు నామినేటెడ్ పదవులను ఇవ్వాలనే డిమాండ్ ఉంది. అలాగే పార్టీలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ నేతలుగా ఉన్న పరకాలకు చెందిన మార్క విజయ్‌కుమార్, కె.రవళి, మీసాల ప్రకాష్, ములుగుకు చెందిన గొల్లపల్లి రాజేందర్‌తో పాటు సుమారు డజను మందికి పైగా కీలక నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలనే ఒత్తిడి అధిష్ఠానంపై ఉంది. వీరితో పాటు గత ఎన్నికల్లో జనగామ నుంచి పోటీ చేసిన ఓటమిపాలైన కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తికి చెందిన కీలక నేత ఝాన్సీరెడ్డిలకు ప్రోటోకాల్ కోసం నామినేటెడ్ పదవి ఇవ్వాలనే డిమాండ్ ఉంది. అయితే ఇప్పటికే 35మందికి రాష్ట్రస్థాయిలో వివిధ కార్పొరేషన్ చైర్మన్ పదవులను భర్తీ చేయగా, ఇంకా సుమారు 30కి పైగా రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవులను భర్తీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రకటించినవి కూడా పార్లమెంట్ ఎన్నికలకు ముందు జాబితానే కావటంతో రెండోవిడత నామినేటెడ్ పదవులను కూడా ఒకటిరెండు వారాల్లో భర్తీ చేస్తారనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆశావాహులు నామినేటెడ్ పదవుల కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో రెండో విడత పదవుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదవులు ఎవరిని వరిస్తాయోననేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల భర్తీ పైనే దృష్టి పెట్టగా.. త్వరలోనే జిల్లా స్థాయి పదవులను భర్తీ చేసేందుకు కసరత్తు చేయనుంది. ఇప్పటికే ఎమ్మెల్యేలు తమ పరిధిలోని మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల చైర్మన్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నారు. వీటితో పాటు జిల్లా స్థాయిలో గ్రంథాలయ చైర్మన్, రైతు సమ న్వయ సమితి కమిటీ చైర్మన్ తదితర పోస్టు లను కూడా భర్తీ చేసేందుకు ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు చేస్తున్నారు. దీంతో ఈ నెలఖారులోపు జిల్లా స్థాయిలో కూడా నామినేటెడ్ పదవులను పూర్తిగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మొత్తానికి పదేళ్ల తరువాత కాంగ్రెస్ శ్రేణుల్లో పదవుల పండుగ వాతావరణం కనిపిస్తోంది.


కుడా చైర్మన్ ఇనుగాలను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు రేవూరి, నాయిని, సుధారాణి, కమిషనర్

నగర అభివృద్ధే నా ధ్యేయం

- 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి
- బాధ్యతల స్వీకరణ
- శుభాకాంక్షలు తెలిపిన నేతలు, అధికారులు

వివరాలు 7లో..


కుల్లా క్రమం అలంకారంలో అమ్మవారు

కుల్లా నిత్యక్లిన్నా అలంకారంలో భద్రకాళి

మూడో రోజుకు శాకంబరీ ఉత్సవాలు


అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే కడియం కావ్య, శ్రీహరి

వరంగల్ కల్చరల్, జూలై 8: భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. సోమవారానికి వేడుకలు మూడో రోజుకు చేరాయి. సోమవారం అమ్మవారి దశ మహావిద్యలోని కాళీ క్రమాన్ని అనుసరించి కుల్లా, సాయంత్రం శోడశి క్రమాన్ని అనుసరించి నిత్యక్లిన్నా అలంకారంలో భద్రకాళి అమ్మవారిని అలంకరించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూ భూమిని ఉద్ధరించింది అమ్మవారు కాబట్టి కుల్లాగా పిలుస్తారన్నారు. రాక్షసుల భారినుంచి వరహమూర్తి రూపంలో నారాయణుడు భూమిని తన కోరలపై పెట్టుకొని రాక్షస సంహారం చేసి భూమండలాన్ని కాపాడినట్టు వెల్లడించారు. నారాయణమూర్తిలోని ఆ వరాహ శక్తియే కుల్లా మాతగా ఉద్ధరించినట్టు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి దర్శనార్థ తరలి వచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో శేష భారతి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా, అమ్మవారిని వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి దంపతులు దర్శించుకోగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఈవో అమ్మవారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందించారు. అలాగే వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


దేవేందర్(ఫైల్)

భూ తగాదాలో.. మాజీ సర్పంచ్ దారుణ హత్య!

- ఇంట్లో నిద్రిస్తుండగా పెద్ద సుత్తెతో దాడి చేసి ఘాతుకం
- పరారీలో నిందితులు
- బురాహన్‌పల్లిలో ఘటన

7



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజావాణి వినతులు పరిష్కరించాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూలై 8: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 118 వినతులు అందగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 76, పౌర సరఫరాల శాఖ 5, మహానగర పాలక సంస్థ 5, విద్యా శాఖ 3, డీఆర్‌డీవో 3, వైద్య ఆరోగ్యశాఖ 1, వివిధ శాఖలకు చెందినవి 25 వినతులు అందినట్లు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


మంచోజు రాజేశ్వరి, ఇల్లంద, వర్ధన్నపేట



అనుమతి లేకుండా వెంచర్ ఏర్పాటు చేయడమే కాకుండా తమ వ్యవసాయ భూమిలోకి వెళ్లకుండా అక్రమంగా ఫెన్సింగ్ వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి. భూమి ఆక్రమించుకుని మమ్మల్నే బెదిరిస్తున్నారు. ఫెన్సింగ్ తొలగించి న్యాయం చేయాలి.

బర్రెల లోన్ ఇప్పించి ఆదుకోవాలి

వల్లందాస్ ఏలియా, వడ్లకొండ, పర్వతగిరి



ఎస్సీ కార్పొరేషన్ నుంచి బర్ల లోన్ కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం మంజూరు చేసింది. యూనిట్ విలువ రూ. 2 లక్షలు ఉండగా, ప్రభుత్వ సబ్సిడీ రూ. 1.40 లక్షలు, ఇందులో మిగతా రూ. 60 వేలు బ్యాంకులో ముందస్తుగా డిపాజిట్ చేస్తేనే లోన్ ఇస్తానని మేనేజర్ అంటున్నారు. నిరుపేద కులానికి చెందిన మేము ఒకేసారి అంత డబ్బు చెల్లించాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బర్ల లోన్ ఇప్పించి ఆదుకోవాలి.

ఎంజీఎంలో మౌలిక వసతులు కల్పిస్తాం

• టీజీ ఎంఎస్‌ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ సహదేవ్ • అధికారులతో సమావేశం


మాట్లాడుతున్న హేమంత్ సహదేవ్

వరంగల్ మెడికల్, జూలై 8 : ఎంజీఎం ఆస్పత్రిలో అవసరమైన మందులు, సర్జికల్స్ వైద్య పరికరాలను సమకూర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.హేమంత్ సహదేవ్‌రావు అన్నారు. సోమవారం ఎంజీఎం కాన్ఫరెన్స్ హాలులో ఎంజీఎంకు అవసరమైన మందులు, మెడికల్ ఎక్విప్‌మెంట్, మౌలిక సదుపాయాల కల్పనపై నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి టీజీ ఎంఎస్‌ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ హాజరయ్యారు. ఎంజీఎంలోని వివిధ విభాగాల ప్రొఫెసర్లు, సూపరింటెండెంట్, ఫార్మసీ డిపార్ట్‌మెంట్, టీజీఎంఎస్‌ఐడీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ ఈ సందర్భంగా ఎంజీఎం ఆస్పత్రికి కావాల్సిన మెడికల్ ఎక్విప్‌మెంట్, మందులు, ల్యాబ్ కెమికల్స్, రియేజెంట్స్ కొరత లేకుండా సకాలంలో పంపిణీ చేయాలని కోరారు. ప్రత్యేకంగా బయో మెడికల్ ఇంజనీరును ఎంజీఎంలో నియమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత రెండు వార్షిక సంవత్సరాల్లో ఎంజీఎం వినియోగించిన ఔషధాలు, సర్జికల్స్ ఆధారంగా భవిష్యత్‌లో ఇండెంట్లు సరఫరా చేస్తానని తెలిపారు. వివిధ విభాగాల శాఖాధిపతులు వారికి కావాల్సిన ఎక్విప్‌మెంట్స్, మందుల సరఫరా చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కౌటిల్యా మాట్లాడుతూ.. అవసరమైన ఇండెంట్లను వైద్య, విద్య సంచాలకుల ద్వారా పంపించాలన్నారు. సకాలంలో వాటిని పంపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చీఫ్ ఇంజనీర్ దేవేంద్ర కుమార్, డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఆర్ఎంవోలు డాక్టర్ మురళీ, డాక్టర్ ప్రసాద్, ఎగ్జిక్యూటీ ఇంజనీర్ ప్రసాద్, డిప్యూటీ ఈఈ రాజశేఖర్, సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఇన్‌చార్జి ఫార్మసిస్టు ఉప్పల భాస్కర్‌రావు, ఫార్మసీ సూపర్ వైజర్ పద్మా వతి తదితరులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన వైద్యులకు మెమోలు

వరంగల్ మెడికల్, జూలై 8 : విధులకు గైర్హాజరైన 10 మంది వైద్యులతోపాటు వైద్య సిబ్బందికి కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 6న కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి ఎంజీఎం ఆస్పత్రి లో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. వారందరి వివరాలు అదే రోజు సమీక్షా సమావేశంలో హాజరు రిజిస్టర్లు, బయో మెట్రిక్ హాజరును ఆర్డీవో కృష్ణవేణితో పరిశీలింపజేశారు. విధుల్లో ఉన్నవారికి హాజరు రిజిస్టర్లలో ఉన్న దానికి పొంతన లేకపోవడాన్ని గుర్తించారు.

ఒక పిల్లల వైద్యుడు జూలై నెల మొత్తం ముందుగానే హాజరు వేసుకోవడాన్ని గుర్తించి అతడిని సస్పెండ్ చేయాల ని డీఎంఈకి సిఫారసు చేశారు. ఈ మేరకు గైర్హాజరైన పది మంది వైద్యులకు సోమవారం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మెమోలు జారీ చేశారు. అలాగే బయో మెట్రిక్ హాజరు వేసి విధుల్లో లేని 79 మంది వైద్య సిబ్బందితోపాటు, ఆలస్యంగా వచ్చిన 63 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో సమాధానం ఇవ్వా లని అందులో పేర్కొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ సత్యశారదా దేవి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూలై 8: వన మహోత్సవంలో భాగంగా నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అటవీశాఖ అధికారి అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలిసి వనమహోత్సవంలో నాటే మొక్కల పురోగతిపై శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో విరివిగా మొక్కలు నాటాలని, దీన్ని ప్రాధాన్య అంశంగా తీసుకొని నిర్దిష్ట గడువులోగా లక్ష్యం పూర్తి చేయాలని తెలిపారు. మొక్కలు నాటడంతోపాటు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని, ఏకకాలంలో ఈ పనులు జరగాలని ఆదేశించారు. జిల్లాకు నిర్ధేశించిన 25లక్షల 58వేల 317 మొక్కల లక్ష్యాన్ని వివిధ శాఖల ద్వారా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా మంత్రులను, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, ప్రత్యేక అధికారులను సైతం భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా అటవీశాఖ అధికారి అనుజ్ అగర్వాల్ మాట్లాడుతూ చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌కి ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. సైట్, లోకేషన్, నర్సరీల వారిగా కార్యక్రమం పూర్తికి టై అప్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

వరంగల్ కలెక్టరేట్, జూలై 8: వచ్చే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సత్య శారదాదేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 3434, మొబైల్ నెంబర్ 91545 25936లలో సంప్రదించాలని సూచించారు.

మూడు రోజుల ఉత్కంఠకు తెర

పోలీసుల చొరవ, పెద్ద మనుషుల హామీతో

ఆందోళన విరమించిన మృతుడి కుటుంబ సభ్యులు

వరంగల్ క్రైం, జూలై 8 : న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడు బండ మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు మూడు రోజులుగా నిందితుడు ప్రభాకర్‌రెడ్డి ఇంటి ఎదుట చేస్తున్న ఆందోళనను విరమించారు. పోలీసుల చొరవ, పెద్ద మనుషుల హామీతో సోమవారం ఆందోళన విరమించి మహేందర్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి చేశారు. మహేందర్‌రెడ్డికి అతడి తమ్ముడి నుంచి రావాల్సిన మూడెకరాల స్థలం తిరిగి ఇప్పించే బాధ్యత గ్రామ పెద్ద మనుషులు తీసుకున్నారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించడంతో మూడు రోజులుగా అనంతసాగర్ గ్రామంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఈ సంఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండ ప్రభాకర్‌రెడ్డి అతడి భార్య జ్యోతి, పెద్ద మనుషులు బండ రత్నాకర్‌రెడ్డి, రామంచ సాయిలును అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపారు. మరో నిందితుడు సాయినాథ్‌రెడ్డి అమెరికాలో ఉన్నాడు.

పోలీసుల చొరవ.. పెద్ద మనుషుల హామీతో..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన బండ మహేందర్‌రెడ్డి, బండ ప్రభాకర్‌రెడ్డిలు ఇద్దరు అన్నదమ్ములు. బండ ప్రభాకర్‌రెడ్డి తన సోదరుడు మహేందర్‌రెడ్డికి చెందిన మూడెకరాల స్థలంలో రెండెకరాలు కుమారుడు సాయినాథ్‌రెడ్డి పేరిట, ఎకరం భార్య జ్యోతి పేరిట ఏడు సంవత్సరాల క్రితం పట్టా చేయించుకున్నాడు. తమ్ముడి చేసిన ద్రోహం గమనించిన మహేందర్‌రెడ్డి తన స్థలం తిరిగి ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు. తమ్ముడు స్పందించకపోవడంతో పెద్ద మనుషులను ఆశ్రయించాడు. పెద్ద మనుషుల నుంచి న్యాయం జరుగలేదు. ఏడేళ్లుగా తిరిగి విసిగి పోయిన మహేందర్‌రెడ్డి ఈనెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని చికిత్స పొందుతూ 5వ తేదీ రాత్రి మృతి చెందాడు. మహేందర్‌రెడ్డి మృతికి ప్రభాకర్‌రెడ్డి కారణమని ఆరోపిస్తూ శనివారం ఉదయం నుంచి శవంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభాకర్‌రెడ్డి ఇంటి ముందు శవం పెట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించారు. తమకు రావాల్సిన స్థలం తిరిగి ఇచ్చాకే ఆందోళన విరమిస్తామని మొండికేసి ఆందోళన సాగించారు. ఆదివారం రాత్రి అనంతసాగర్ వచ్చిన కాజీపేట ఏసీపీ తిరుమల్ నూతనంగా ఇద్దరు పెద్ద మనుషులను పెట్టి ఏడు సంవత్సరాలుగా పంచాయతీ చేస్తున్న 12 మందిని పిలిపించాడు. 14మంది సమక్షంలో ప్రభాకర్‌రెడ్డి నుంచి తిరిగి స్థలం ఇప్పించేలా ఒప్పంద పత్రాలు రాయించి మృతుడి కుటుంబ సభ్యులను ఒప్పించాడు. పోలీసుల చొరవ, పెద్ద మనుషుల హామీతో మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం ఆందోళన విరమించారు. మొత్తంగా మూడు రోజులుగా గ్రామంలో శవంతో ఆందోళన చేయడం సంచలనంగా మారింది.

ముగ్గురు మోటార్ల దొంగల అరెస్టు

రూ.3 లక్షల విలువైన 12 మోటార్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మోటార్లు, నిందితులతో పోలీసులు

వరంగల్ క్రైం, జూలై 8 : నీటి మోటార్ల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను సీసీఎస్, కేయూ పోలీసులు కలిసి అరెస్టు చేశారు. రూ. 3 లక్షల విలువైన 12 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హనుమకొండ ఏసీ పీ కె.దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మడికొండ ప్రాంతానికి చెందిని పత్తిరాజు, శ్రీపతి ప్రేమ్‌కుమార్, తూరపాటి ఏసుకుమార్ జల్సాలకు అలవాటుపడి నగర పరిసర ప్రాంతాలకు చెం దిన పంటపొలాల్లోని నీటి మోటార్లను చోరీ చేస్తున్నారని తెలిపారు. మోటార్ల చోరీలపై పలు ఫిర్యాదులు అందడంతో విచారణ ప్రారంభించినట్లు ఆయన అన్నారు. సోమవారం ఉదయం కేయూ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నీటి మోటార్లతో ద్విచక్రవాహనంపై వస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు ఆయన తెలిపారు. విచారణలో ముగ్గురు వ్యక్తులు మోటార్ల చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారని ఆయన పేర్కొన్నారు. ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. విలేకర్ల సమావేశంలో కే యూ సీఐ బి.సంజీవ్, సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఎస్‌ఐలు రాజ్‌కుమార్, దేవేందర్, రవిందర్, బుచ్చి రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

కేయూ క్యాంపస్, జూలై 8 : కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ గోపు సుధాకర్ తన లైబ్రరీకి చెందిన పుస్తకాలను కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి ఉచితంగా అందచేశారు. ఈ మేరకు సోమవారం కేయూ క్యాంపస్‌లోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావును కలిసి పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో విభాగం ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు, అధ్యాపకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, డాక్టర్ చీకటి శ్రీను, డాక్టర్ బుర్రి ఉమాశంకర్, డాక్టర్ ఒడ్డెపల్లి మోహన్ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'తప్పుడు ఆరోపణలు తగదు'

కేయూ క్యాంపస్, జూలై 8: కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ పై తప్పుడు ఆరోపణలు తగవని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2010లో కాకతీయ యూనివర్సిటీ న్యాయ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులైన ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేయూ పాలక మండలి సభ్యులు గా ఎంపిక చేసిందన్నారు. అధ్యాపకుల నియమకంపై వివాదం రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని దీన్ని ఆసరాగా చేసుకుని మా నసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

దూరవిద్య ఎంఎస్‌డబ్ల్యూ ఫీజు గడువు 18

కేయూ క్యాంపస్, జూలై 8: కాకతీయ యూనివర్సిటీ మాస్టర్ ఆఫ్ సోసల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) 2023-2024 రెండో ఏడాది టర్మ్ ఫీజు, పరీక్షల ఫీజులను ఈనెల 18 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య కేంద్రంలోని ఎస్‌బీఐ కౌంటర్‌లో చెల్లించుకోవాలని పేర్కొన్నారు. త్వరలోనే రెండోవ ఏడాది తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

నిట్‌తో 'బయోవి' సంస్థ ఒప్పందం



ఎంఓయూలను మార్చుకుంటున్న నిట్ డైరెక్టర్ సుబుధి, బయోవి ఎండీ లక్ష్మీప్రసాద్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 8 : వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ (నిట్)తో హైదరాబాద్‌కు చెందిన వ్యవసాయ ఉత్పత్తులను అందించే బయో వి ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ మేరకు సోమవారం నిట్ క్యాంపస్‌లో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, బయో వి ఎండి. డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బయోటెక్నాలజీ విభానికి చెందిన ఫ్యాకల్టీతో పాటు విద్యార్థులు పరిశోధన శాలల సౌకర్యాల పరస్పర మార్పిడితో పనిచేయవచ్చునన్నారు. విద్యార్థులు బయోవి లో ఇంటర్న్‌షిప్‌లకు అవకాశం ఉంటుందని, బయో వి పరిశోధనల్లో నిట్ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాలుపంచుకోనున్నారన్నారు. జపాన్‌కు చెందిన టోక్యో అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు అకినోరి, హిరోకి, మియా సాకి, సింగాపూర్ జీ అండ్ జీ కంపెనీ ఎండీ గౌరీశంకర్ నిట్‌ను సందర్శించారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచాలి

కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



మాట్లాడుతున్న అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జులై 8 : సైబర్ నేరగాళ్ల చేతుల్లో ప్రజలు మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సైబర్ వారియర్లకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో కమిషనరేట్‌కు చెందిన సైబర్ వారియర్స్‌తో సోమవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్టేషన్ల వారీగా నమోదైన సైబర్ నేరాలపై ఆరా తీయడంతో పాటు సైబర్ నేరాల నియంత్రణకు సైబర్ వారియర్లు తీసుకుంటున్న చర్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ఆయా స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాలకు గురికాకుండా సైబర్ వారియర్స్ అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్క రించాలన్నారు. సైబర్ నేరాల్లో నేరస్తులకు సంబంధించిన పీటీ వారెం ట్లను పరిష్కరించడంతో పాటు నిలిపేసిన సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతా ల్లోని డబ్బు తిరిగి బాధితులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ రవి, సైబర్ క్రైం విభాగం ఏసీపీ విజయ్‌కుమార్, వర్టికల్స్ ఇన్‌చార్జ్ ఏసీపీ జనార్ధన్‌రెడ్డి, సైబర్ క్రైమ్ సీఐ రవి, ఎస్‌ఐలు చరణ్, శివ పాల్గొన్నారు.

న్యాయవాదిపై అనుచితంగా

ప్రవర్తించిన సీఐపై 'బార్' సీరియస్

సీఐని సస్పెండ్ చేయాలని ర్యాలీ, రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్, జూలై 8 : న్యాయవాదిపై అనుచితంగా ప్రవర్తించిన ఇంతేజార్‌గంజ్ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల న్యాయవాదులు డిమాండ్ చేశారు. న్యాయవాది మాదాసి వినయ్‌కుమార్‌ను దుర్భాషలాడిన సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని న్యాయవాదులు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేశారు. సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 6న సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్తున్న న్యాయవాదిని ఆపి కారు తాళం గుంజుకొని అసభ్య పద జాలంతో దూషించారని, న్యాయవాదినని చెప్పినా వినకుండా ఐతేంటీ అంటూ మరింత దుందుడుకుగా వ్యవహరించడంపై బార్ అసోసియేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సంఘటనను నిరసిస్తూ ఉభయ జిల్లాల బార్ అసోసియేషన్ సీఐ తీరుపై నిరసన వ్యక్తం చేశాయి. కోర్టు ప్రాంగణం నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా వచ్చి అమర వీరుల స్థూపం మీదుగా కోర్టు గేటు ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధ్యుడైన సీఐపై తగిన చర్యలు తీసుకోకుంటే నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని న్యాయవాదులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ముదసర్ అహ్మద్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లాదె రమేష్, ఇతర కార్యవర్గ సభ్యులు , సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

'కళాకారుల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి'



డాక్యుమెంటరీని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, జూలై 8 : కళాకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు కళాకారులు తమవంతు కృషి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం రాత్రి నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో బాగా పొద్దుపోయే దాక జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు సీతాల రఘువేందర్ ఆధ్వర్యంలో సీనియర్ కళాకారుల సేవా ట్రస్టును అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డిలు కలిసి ఆవిష్కరించారు. ఇదే వేదికపై రోజా క్రియేషన్స్ డైరెక్టర్ ఆలేటి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో రోజా క్రియేషన్స్ 30 వసంతాల వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. క్రైం ఏసీపీ విజయ్‌కుమార్, ప్రముఖ సీఏ త్రిపురనేని గోపీచంద్, డాక్టర్ రావుల జగదీశ్వర్, యాదవరెడ్డి, ఆడెపు రవీందర్, జూనియర్ ఘంటశాల గుజ్జారి రమేశ్ అనేక మంది కళాకారులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ఈ సందర్భంగా ఓడపల్లి చక్రపాణి, మిమిక్రీ సదాశివ్, తయ్యాల శ్రీధరాచార్యులు, బుల్లి తెర ఫేం ఆర్ఎస్.నందా, ఎంఎస్.నవీన్ కుమార్, వంగరి వేణుగోపాల్‌లకు రోజా క్రియేషన్స్ ద్వారా ప్రత్యేక అవార్డులతో సత్కరించారు. కాళేశ్వరం సాయిమనస్వినికి జ్యోతిష్యరత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గుజ్జర్ అజయ్ నిర్మించిన చాక్లెట్స్ డాక్యుమెంటరీని ప్రముఖులు ఆవిష్కరించారు.

వేం నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీలను కలిసిన కేయూ పాలక మండలి సభ్యులు

కేయూ క్యాంపస్, జూలై 8 : ఇటీవల నూతనంగా నియమితులైన కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఎలాంటి ఒత్తిళ్ళకు లోనూ కాకుండా సీరియస్‌గా పనిచేయాలని సూచించారు. కేయూ వీసీ నియమాకం కోసం ఏర్పాటు చేసే సెర్చ్ కమిటీకి ఒకరిని నామినేట్ చేయాలని పేర్కొన్నారు. దీని కోసం మళ్ళీ కలవాలని సూచించారు. లా ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ప్రొఫెసర్ సురేశ్‌లాల్, బొద్దిరెడ్డి రమల బయోడేటాను పూర్తిగా పరిశీలించిన తర్వాతనే మెరిట్ ఆధారంగా నామినేట్‌గా చేశామని స్పష్టం చేశారు.

ప్లేస్‌మెంట్లలోనూ ఎస్సార్ విద్యార్థులు టాప్





యల్లా కృష్ణవేణి

ప్లేస్‌మెంట్ వివరాలను వెల్లడిస్తున్న వీసీ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ అర్చనరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 8 : ఉత్తమ ఫలితాల్లోనే కాదు విద్యార్థులకు ఉపాధి కల్పించడంలోనూ ఎస్సార్ యూనివర్సిటీ టాప్‌లో నిలుస్తుందని యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ దీపక్ గార్గ్ అన్నారు. సోమవారం అనంతసాగర్‌లోని యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ ప్రాంగణ నియామకాలు వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ గార్గ్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ విద్యార్థిని యల్లా కృష్ణవేణికి రూ.34.4లక్షల వార్షిక ఆదాయంతో ఉద్యోగం సాధించిందన్నారు. ఈ ఏడాదిలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో సగటున ఒక్కొక్కరు రూ.5.8లక్షల వార్షిక ఆదాయంతో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ సంవత్సరం మొత్తం 896 మంది విద్యార్థులు వేర్వేరు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. యాక్సెంచర్, ఎయిర్‌టెల్, బోస్చ్, క్యాటర్ పిల్లర్, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, పేపాల్ తదితర కంపెనీల్లో ఎస్సార్ విద్యార్థులు వివిధ హోదాల్లో ఉద్యోగాలు పొందారన్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు సాధించిన ప్రతీ విద్యార్థికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అర్చనరెడ్డి, డీన్ ఫ్యాకల్టీ డాక్టర్ వి. మహేష్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ గురుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదులుగా నలుగురు నియామకం



కె.నర్సింహారావు, ఎస్.మహాత్మా, ఆర్.వాణి, టి.రాజ్‌కుమార్

వరంగల్ లీగల్, జూలై 8 : ప్రభుత్వ న్యాయవాదులుగా నలుగురిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ జిల్లా ప్రభుత్వ న్యాయవాదిగా కె.నర్సింహారావు, ఆర్బిట్రేషన్ కేసుల ప్రత్యేక న్యాయవాదిగా ఎస్. మహాత్మ, ఎల్ఆర్ఏటీ కం హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు సహాయక ప్రభుత్వ న్యాయవాదిగా తోట రాజ్‌కుమార్, ఇండస్ట్రియల్ ట్రిబునల్ కం లేబర్ కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా రావుల వాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు తాత్కాలికంగా ఆరు నెలల పాటు విధులు నిర్వహించనున్నారు.

సీఎస్‌సీలపై విస్తృత ప్రచారం జరపాలి

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 8: కామన్ సర్వీసు సెంటర్ల(సీఎస్‌సీ)సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి తద్వారా ఆర్థికంగా ప్రయోజనం పొందాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సూచించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకులో సీఎస్ సెంటర్ల సేవలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, ఆధార్, పాన్‌కార్డు, విద్యుత్ బిల్లుల చెల్లింపు తదితర సేవల వినియోగాన్ని ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ప్రజలకు అందునుండడం హర్షణీయమన్నారు. సమావేశంలో డీసీసీ సీఈవో వజీర్ సుల్తాన్, జనరల్ మేనేజర్ ఉషశ్రీ, డీజీయం అశోక్, ఉమ్మడి జిల్లాలోని మేనేజర్లు పాల్గొన్నారు.

ఇంటినుంచే వినియోగదారుల గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయొచ్చు

- వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రావు



బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్ఈ

హనుమకొండ టౌన్, జూలై 8 : వినియోగదారులు ప్రతీ సోమవారం జరిగే విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ద్వారానే కాకుండా ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్ టీజీఎన్పీడీసీఎల్.కామ్‌లో కన్జ్యూమర్ గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా ఎప్పుడైనా విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని వరంగల్ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు తెలిపారు. విద్యుత్ ప్రజావాణిలో భాగంగా సోమవారం బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. విద్యుత్ ప్రజావాణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 61 ఫిర్యాదులు రాగా ఇప్పటి వరకు 48 పరిష్కరించడం జరిగిందన్నారు. ఎక్కువగా గృహజ్యోతి, విద్యుత్ పోల్ షిఫ్టింగ్‌పై ఫిర్యాదులు వచ్చాయన్నారు. గృహజ్యోతి లబ్ధిదారులు ఎంపీడీవో, మునిసిపాలిటీ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకుంటే అర్హుల జాబితా ఎన్పీడీసీఎల్‌కు వస్తుందని, అప్పటి నుంచి జీరో బిల్లు అమలుచేయడం జరుగుతుందన్నారు. హనుమకొండ సర్కిల్‌లో ఇప్పటి వరకు 84 ఫిర్యాదులు రాగా 75 పరిష్కరించడం జరిగిందని ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. సోమవారం కొత్తగా 5 ఫిర్యాదులు రాగా అప్పటికప్పుడు ఒక ఫిర్యాదును పరిష్కరించడం జరిగిందన్నారు.

భవనం పైనుంచి పడి యువతి మృతి



యువతి మృతదేహం

బాలసముద్రం, జూలై 8 : హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో భవనం పై నుంచి పడి ఓ యువతి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. సుబేదారి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలఘాట్ జిల్లా పారసోని గ్రామానికిచెందిన బీమలతవాసినిక్, సురేందర్ దంపతులు జీవనోపాధి కోసం వారం రోజుల క్రితం హనుమకొండకు వచ్చారు. వీరికి కూతురు సుహానవాసినిక్, కొడుకు అన్మోల్ వాసినిక్ ఉన్నారు. సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్ ద్వారా హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో భవన నిర్మాణం పనులు చేస్తున్నారు. ఐదో అంతస్థులో పనులు చేస్తుండగా సుహానవాసినిక్ ప్రమాదశావత్తు ఫైర్ సెఫ్టిహోల్‌లో పడడంతో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై గాలిబ్ తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంజీఎంను తనిఖీ చేసిన ఆర్డీవో



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో కృష్ణవేణి

వరంగల్ మెడికల్, జూలై 8 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణపై ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.సోమవారం కలెక్టర్ ఎంజీఎంను తనిఖీ చేస్తుందనే ఆందోళనలో ఎంజీఎం అధికారులు కార్యాలయాల్లోనే ఉన్నారు. ఓపీలకు పరుగులు తీశారు. ఉదయం 9గంటలకే ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ఆర్ఎంఓలు మురళి, శ్రీనివాస్ ఆస్పత్రి కి చేరుకొని ఓపీ విభాగాలను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వైద్యులు కూడా సకాలంలో విధులకు హాజరయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ కృష్ణవేణి ఎంజీఎంను సందర్శించారు. ఈ సందర్భంగా పలు వార్డులను పరిశీలించారు. రోగులు చికిత్స పొందే క్యాజువాలిటీని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఆస్పత్రిని సందర్శించిన అనంతరం అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఈ అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

అదిగో.. ఇదిగో..

- మినీ లెదర్ పార్కు కోసం 22ఏళ్లుగా ఎదురుచూపులే
- కడియమే తెచ్చారు.. కడియమే పూర్తి చేస్తారంటూ చర్మకారుల ఆశలు
- ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరిపైనే ఆశలు పెట్టుకున్న వైనం
- పరిశ్రమ పూర్తయితే 5వేల మందికి ఉపాధి
- 25ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించిన అప్పటి ప్రభుత్వం
- 2002లో అంకురార్పణ చేసిన కడియం.. 2003లో శిక్షణ



ధ్వంసమైన లెదర్‌పార్కు భవనంపై కప్పు



యంత్రాలు పాడవకుండా కప్పిన టార్పాలిన్

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 8 : చర్మంతో వస్తువులను తయరు చేసి ఉపాధి పొందే దళిత కుటుంబాల అభ్యున్నతి కోసం ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటుచేయతలపెట్టిన మినీ లెదర్ పార్కు కార్యరూపం దాల్చడం లేదు. అదిగో వస్తోంది.. ఇదిగో వస్తోంది అంటూ చర్మకార కుటుంబాలు 22ఏళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం హైదరాబాద్‌లోని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (లిడ్‌క్యాప్)ను మూసి వేయడంపై అధ్యయనం చేసింది. ఆ అధ్యయనంలో భాగంగా అప్పటి డీఐజీ, ప్రస్తుత ఏపీలోని బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ లెదర్ పరిశ్రమల అవసరతపై అధ్యయనం పూర్తి చేసి 2002లో నాటి టీడీపీ ప్రభుత్వానికి నివేదిక అందించారు. పరిశ్రమలను మూసివేస్తే చర్మ వృత్తులను ఆధారంగా చేసుకొని జీవిస్తున్న దళితులు ఇబ్బందులు పడతారని రాష్ట్రంలో వీలైనన్ని పరిశ్రమలను పెంచాలని ఆ నివేదికలో కోరారు. దాంతో ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ జిల్లా కాకుండా మిగతా జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలను బట్టి లెదర్ ఇండస్ట్రీస్‌ను, మినీ లెదర్ పార్కులను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా 2002 చివరలో తెలంగాణలోని తొమ్మిది జిల్లాల్లో లెదర్‌పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాలను గుర్తించారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో మినీ లెదర్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

2003లో మినీ లెదర్ పార్కుకు శంకుస్థాపన

ఘన్‌పూర్ శివారులోని సర్వే నెంబర్ 502/2, 503/2 లలోని 25 ఎకరాల స్థలంలో మినీ లెదర్‌పార్కు ఏర్పాటుకు 2003లో అప్పటి రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ప్రస్తుత స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ముందుగా స్థలంలో రూ.10 లక్షలు వెచ్చించి భవనాన్ని నిర్మించి కుట్టుమిషన్లు, బఫ్ఫింగ్, స్కైవింగ్, హీట్ మిషన్లు ఏర్పాటు చేశారు. అనంతరం టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటికే పరిశ్రమలో పనులు ప్రారంభమైనప్పటికి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో కార్యాచరణకు నోచుకోలేదు.

25ఎకరాల స్థలం ఎందుకంటే..

లెదర్‌పార్కు ఏర్పాటు కోసం ఘన్‌పూర్ శివారులో 25ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. లెదర్ పరిశ్రమలో 2000మంది కార్మికులు ప్రత్యక్షంగా, మరో 2000 మంది పరోక్షంగా ఉపాధి పొందే లక్ష్యంతో నిర్మాణ పనులు చేబట్టారు. ప్రత్యక్షంగా పనిచేసే కార్మికులకు సదరు స్థలంలో గృహల ఏర్పాటు చేయడం, పాఠశాలను, అనుపత్రిని, పోస్టాఫీసును, ఆట స్థలాన్ని ఏర్పాటు చేయడానికిగాను స్థలాన్ని కేటాయించారు.

శిక్షణకు వెళ్లారు..

లెదర్ పార్కులో చర్మవస్తువులు తయారీలో శిక్షణ పొందడానికిగాను నియోజకవర్గంలోని చిలుపూర్, ఘన్‌పూర్, జఫర్‌గడ్ మండలాలకు చెందిన 33 మంది చర్మకారుల్లో 16మంది చెన్నైకి, 8మంది గోవాకు, 9మంది హైదరాబాద్‌లలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ సంస్థలో ఆరు వారాల పాటు లెదర్‌బూట్లు, చెప్పులు, కోట్లు, చేతి సంచులు, బెల్టులు, బ్యాగులు, పర్సులు తదితర వస్తువులు రూపొందించడంపై శిక్షణ పొందారు. శిక్షణ పొందిన వారు నియోజకవర్గంలోని మిగతా చర్మకారులకు శిక్షణనిచ్చారు. మొత్తంగా 2వేల మంది కార్మికులు శిక్షణ పొంది సిద్ధంగా ఉన్నారు. పరిశ్రమ పూర్తయితే ప్రత్యక్షంగా 2వేల మందికి పరోక్షంగా 3వేల మందికి మొత్తం సుమారు 5వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



లెదర్ పరిశ్రమ కోసం నిర్మించిన భవనం చుట్టూరా పెరిగిన చెట్లు

ప్రత్యేక రాష్ట్రంలోనైనా వస్తుందని ఆశపడ్డారు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తరువాత 2016 డిసెంబరులో అసెంబ్లీ సమావేశాల్లో పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఘన్‌పూర్‌లో 270.10 కోట్లతో, సర్వే నెంబరు 502, 503ల లోని 170 ఎకరాల ప్రభుత్వ భూమిలో మెగా లెదర్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాధనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందని తెలిపారు. అదిశగా గత ప్రభుత్వం కార్యచరణ చేబట్టకపోవడంతో అది సాధ్యం కాలేదు.

కడియంపైనే ఆశలు

22 ఏళ్ల క్రితం నియోజకవర్గంలోని చర్మకారులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో లెదర్‌పార్కు ఏర్పాటుకు అంకురార్పణ చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొంది అధికార పార్టీలో ఉండడంతో పాటు కడియం కుమార్తె కావ్య ఎంపీగా గెలుపొందడంతో ఏలాగైన లెదర్‌పార్కును కడియం కుటుంబం తీసుకువస్తుందని 22ఏళ్ల నిరీక్షణకు తెరపడుతుందని చర్మకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాడు కడియం తీసుకువచ్చారు.. నేడు అయనే పూర్తి చేస్తారని చర్మకారులు దీమా వ్యక్తం చేస్తున్నారు.

22ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..

గాదె శ్రీధర్, చర్మకారుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు



లెదర్ పార్కు ఏర్పాటు జరిగితే శిక్షణ పొందినందున ఉపాధి లబిస్తుందని 22ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. పరిశ్రమ ఏర్పాటు జరిగితే నియోజకవర్గ దళితుల్లో పేదరికం కొంతమేర పోయ్యే అవకాశం ఉంటుంది. పాలకులు పరిశ్రమలపై దృష్టి పెటాల్సిన బాధ్యత వారికి ఉండాలి.

చెన్నైలో శిక్షణ తీసుకున్నాం..

ఈశ్వరయ్య, చర్మకారుడు, ఛాగల్ గ్రామం



లెదర్ పార్కు ప్రారంబిస్తారని అప్పటి ప్రభుత్వం 2003లో చెన్నైలో శిక్షణనిచ్చారు. చర్మ సంబంధ ఉత్పత్తుల తయారీపై మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ తీసుకొని అనంతరం ఇక్కడి యువకులకు మేం శిక్షణ అందించాం. అనేక ఏళ్లుగా పరిశ్రమ కోసం ఎదురు చూస్తున్నాం. ఈ ప్రభుతకవమైనా స్పందించి పరిశ్రమను నెలకొల్పాలి.

కడియం శ్రీహరి సమస్యను పరిష్కరిస్తారనుకుంటున్నాం..

గాదె కుమార్, చర్మకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి, ఎంపీగా కడియం కావ్య ఉన్నందున సమస్యలను పరిష్కరించి.. లెదర్ పరిశ్రమ ఏర్పాటు కలను సాకారం చేస్తారన్న ఆశ కలుగుతోందన్నారు. 22ఏళ్ల క్రితం పరిశ్రమ ఏర్పాటుకు అంకురార్పణ చేసిన కడియమే.. దీనిని పూర్తి చేసి చర్మకారుల కుటుంబాల్లో వెలుగులు నింపుతారని భావిస్తున్నాం.

నగర అభివృద్ధే నా ధ్యేయం

- 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి
- బాధ్యతల స్వీకరణ
- శుభాకాంక్షలు తెలిపిన నేతలు, అధికారులు



కుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై 8 : వరంగల్‌ను ఆదర్శ నగరంగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో పలువురు నేతలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో.. సోమవారం సాయంత్రం ఆయన వరంగల్‌లోని కుడా కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయనకు ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్, కుడా వైస్ చైర్మెన్ అశ్విని తానాజీ వాకడే, కిసాన్ మోర్చా సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట నర్సింహారెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన సోనియా, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తానని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఔటర్‌రింగ్ రోడ్డుతో పాటు విమానాశ్రయం, ప్రధాన రోడ్డు పూర్తి చేయడమే ప్రధాన అంశంగా స్వీకరిస్తామన్నారు.

మార్చి 15న కుడా చైర్మన్‌గా ప్రకటన

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ యేడు మార్చి 15న రాష్ట్రంలోని పలు శాఖలకు నామినేటెడ్ పోస్టులను కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. ఈ క్రమంలో వరంగల్ కుడా చైర్మెన్‌గా ఇనుగాల వెంకట్రామ్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మర్నాడు 16న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కోడ్‌అమలులోకి వచ్చింది. దీంతో చైర్మెన్ పదవి ప్రకటించినా బాధ్యతల స్వీకరణకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. కాగా, సోమవారం మధ్యాహ్నం 35 మంది చైర్మెన్‌లను రాష్ట్ర వ్యాప్తంగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని జీవో జారీ చేయడంతో పరిస్థితులు తాముమారు అవుతుండడంతో కొందరు హడావిడిగా ప్రకటించిన రోజే బాధ్యతలు స్వీకరించినట్టు ప్రచారం జరుగుంది.

బయోడెటా

పేరు: ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి
తల్లిదండ్రులు : ఇనుగాల అమరేందర్‌రెడ్డి, సుజితారెడ్డి
విద్యార్హతలు: పీజీ డిప్లమా ఇన్ కంప్యూటర్ సైన్స్
పుట్టిన తేదీ: 6-9-1968
స్వగ్రామం : ఆత్మకూరు మండల కేంద్రం, హనుమకొండ జిల్లా
భార్య: అవంతిరెడ్డి
కుమార్తె: శ్రీలలితారెడ్డి
రాజకీయ ప్రస్థానం : 2013లో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2016లో సింగిల్‌విండో చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. 2014లో పరకాల శాసనసభకు ఎమ్మెల్యేగా పోటీ చేసి స్వల్ప మెజారిటీలో ఓటమిపాలయ్యారు. ప్రస్తుతం పీసీసీ మెంబర్, తెలంగాణ నార్తర్న్ జిల్లా కో ఆర్డినేటర్‌గా, కాంగ్రెస్ పరకాల నియోజక వర్గ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నారు.

జల్సాలకు మరిగి.. చోరీల బాట ఎంచుకుని

- తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురి అరెస్టు
- వారిలో ఒకరు బాల నేరస్థుడు
- రూ.12లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి

సరూర్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి సులువుగా సొమ్ము సంపాదించడం కోసం ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను సోమవారం మీర్‌పేట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకడు మైనర్(బాల నేరస్తుడు) కావడం గమనార్హం! దీనికి సంబంధించిన వివరాలను సోమవారం మీర్‌పేట్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ నాగరాజుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి వెల్లడించారు. జనగామ జిల్లా, రఘునాథ్‌పల్లి మండలం బానాజీపేట్‌కు చెందిన వల్లెపు జితేందర్ అలియాస్ జిత్తు(20) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ మండలంలోని పీర్జాదిగూడలో నివసిస్తూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మహబూబాబాద్ జిల్లాలోని టీటీనగర్‌కు చెందిన రాపోల్ చందు అలియాస్ కృష్ణ(21) ఉప్పల్‌లో ఉంటూ సెంట్రింగ్ పని చేస్తున్నాడు. వరంగల్ జిల్లా గూడూరుకు చెందిన రాపోల్ శ్రీశైలం అలియాస్ చిన్నా(34) ఉప్పల్‌లోని బీరప్పగడ్డలో నివసిస్తూ లేబర్ పని చేస్తున్నాడు. వీరు ముగ్గురితో పాటు మరో బాల నేరస్తుడు కలిసి జట్టుగా ఏర్పడి రాత్రి వేళల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి సొత్తు చోరీ చేయడం ప్రవృత్తిగా పెట్టుకున్నారు. జిత్తు, కృష్ణ, బాల నేరస్తుడిపై వనస్థలిపురం, మీర్‌పేట్, మేడిపల్లి పీఎస్‌లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. వారంతా పలుమార్లు జైలుకు సైతం వెళ్లి వచ్చారు. సదరు ముగ్గురు జైలు నుంచి(బాల నేరస్తుడు అబ్జర్వేషన్ హోమ్ నుంచి) బయటకు వచ్చిన తర్వాత రాపోల్ శ్రీశైలంను పరిచయం చేసుకుని మళ్లీ చోరీలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఇటీవల బడంగ్‌పేట్ మారుతీనగర్‌కు చెందిన రమేశ్ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన మీర్‌పేట్ పోలీసులు సీసీ టీవీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు జరిపి నలుగురు నిందితులను సోమవారం హయత్‌నగర్ ప్రాంతంలో అరెస్టు చేశారు. వారి నుంచి 125 గ్రాముల బంగారు నగలు, 450 గ్రాముల వెండి వస్తువులు, ఒక ద్విచక్ర వాహనం, ఒక ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. ఈ సొత్తు విలువ రూ.12లక్షలు ఉంటుందని ఏసీపీ కాశీరెడ్డి చెప్పారు. నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించారు.

భూ తగాదాలో మాజీ సర్పంచ్ దారుణ హత్య!

- ఇంట్లో నిద్రిస్తుండగా పెద్ద సుత్తెతో దాడి చేసి ఘాతుకం
- పరారీలో నిందితులు
- వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాహన్‌పల్లిలో ఘటన



రక్తపు మడుగులో సూదుల దేవేందర్, దేవేందర్ నివాసం వద్ద గుమిగూడిన జనం

రాయపర్తి, జూలై 8: భూ తగాదా విషయంలో తాజా మాజీ సర్పంచ్ హత్యకు గురైన సంఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాహన్‌పల్లిలో జరిగింది. ఓ స్థలం విషయంలో హతుడు, నిందితుల మధ్య ఆరేళ్లగా వివాదం జరుగుతుండగా.. అర్ధరాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న మాజీ సర్పంచ్‌పై పెద్ద సుత్తెతో దాడి చేసి హతమార్చడం తీవ్ర కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాహన్‌పల్లికి చెందిన తాజా మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్(56)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె అమెరికాలో ఉంటుండగా, ఆమెకు ప్రసవ సమయం కావడంతో సాయంగా ఉండేందుకు దేవేందర్ భార్య ఉమ ఐదునెలల క్రితం అమెరికా వెళ్లింది. కుమారుడు ఉద్యోగ రీత్యా, వివాహమైన చిన్న కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారు. దాంతో ప్రస్తుతం దేవేందర్ ఒక్కరే ఇంటివద్ద ఉంటున్నారు. ఆయనకు హనుమకొండలోని యాదవనగర్‌లో కూడా ఓ ఇల్లు ఉండగా అక్కడకు తరచూ వెళ్లివచ్చేవారు. ఇదిలాఉండగా గత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో దేవేందర్ సర్పంచ్‌గా గెలుపొందారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన పల్లె మల్లేష్ అనే వ్యక్తికి దేవేందర్‌కు మధ్య ఆరేళ్లుగా భూ తగాదాలున్నాయి. ఈ విషయంలో పోలీస్ స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి. అయితే ఆదివారం దేవేందర్ ఇంట్లో ఒక్కరే ఉండగా.. అప్పటికే భూ తగాదా కోపం పెంచుకుని కసి మీదున్న దుండగులు ఇదే అదనుగా దేవేందర్‌ను హతమార్చినట్టు తెలుస్తోంది. దేవేందర్ నిద్రించిన తర్వాత ఇంట్లోకి చొరబడి భారీ సుత్తితో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి చనిపోయాడని నిర్ధారించుకున్నాక సుత్తెను బాత్రూంలో ఉండే నీటి బకెట్‌లో వేసి, గోడదూకి పరారయ్యారు. సోమవారం ఉదయం పనిమనిషి బాల యాకమ్మ తలుపు తీసి చూసే సరికి దేవేందర్ నెత్తుటి మడుగులో కనిపించడంతో గ్రామస్థులకు విషయం చెప్పింది. భూ తగాదా కారణంగానే తన తండ్రిని పల్లె మల్లేష్, అతడి కుమారుడు పల్లె మురళీ హత్య చేసినట్టు దేవేందర్ కుమారుడు నిఖిల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ వివాదం..

రాయపర్తి మండలంలోని కొండూరుకు చెందిన ప్రకాష్.. బురాహన్‌పెల్లి శివారులోఉన్న మూడెకరాల భూమిని ఆరేళ్ల క్రితం దేవేందర్‌కు అమ్మాలని నిర్ణయించుకుని దేవేందర్ నుంచి రూ.4లక్షలు బయానా తీసుకున్నాడు. కానీ దేవేందర్ మిగతా డబ్బులు ఇవ్వకపోవడం, రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోకపోవడంతో ప్రకాష్ సదరు స్థలాన్ని అదేగ్రామానికి చెందిన పల్లె మల్లేష్‌కు విక్రయించాడు. విషయం తెలుసుకున్న దేవేందర్ తాను బయానాగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రకాష్, పల్లె మల్లేష్‌లపై రాయపర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పెద్ద మనుషుల మధ్యలో పంచాయతీ చేయగా.. పెద్ద మనుషులు చేసిన తీర్మానాన్ని దేవేందర్ అంగీకరించలేదు. అప్పటి నుంచి దేవేందర్, పల్లె మల్లేష్ మధ్య ఈ వివాదం కొనసాగుతూనే ఉంది.


గతంలో మల్లేష్‌పై హత్యాయత్నం

రెండేళ్ల క్రితం పల్లె మల్లేష్‌పై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటడిన మల్లేష్.త నపై జరిగిన దాడి వెనక దేవేందర్ హస్తం ఉందని భావించి ఆయనపై కోపం పెంచుకున్నాడని, ఈ రెండేళ్ల నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరినట్టు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే దేవేందర్‌ను హతమార్చినట్టు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

నిందితుడి ఇంటి వద్దకు జాగిలాలు..

హత్య జరిగిన ఘటనా స్థలం వద్ద పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. దేవేందర్‌ఇంటిని పూర్తి స్థాయిలో జాగిలాలతో క్షుణ్ణంగా పరిశీలించి.. నిందితులను గుర్తించేందుకు గ్రామంలో గాలింపు చర్యలు చేపడుతుండగా ఆ జాగిలాలు పల్లె మల్లేష్ ఇంటి వద్దే నిలిచి పోయాయి. దీంతో పోలీసులు హత్య చేసిన నిందితులపై ప్రాథమికంగా ఓ నిర్ధారణకు వచ్చారు. సంఘటన స్థలాన్ని సైతం వెస్ట్‌జోన్ డీసీపీ మహేందర్ నాయక్ చేరుకుని పరిశీలించారు. వర్ధన్నపేట సీఐ సూర్య ప్రకాష్, రాయపర్తి ఎస్‌ఐ సందీప్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వర్ధన్నపేట, జఫర్‌ఘడ్ ఎస్‌ఐలు ప్రవీణ్ కుమార్, రవిలు వారి సిబ్బంది బందోబస్తు చేశారు. అనంతరం దేవేందర్ మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

దేవేందర్ మృతదేహాన్ని చూసి గుండెపోటుతో వృద్ధుడి మృతి



కొమురయ్య (ఫైల్)

రాయపర్తి, జూలై 8 : గుండెపోటుతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బురాహన్‌పల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... బురాహన్‌పెల్లి గ్రామానికి చెందిన బాలే కొమురయ్య(70) మధ్యాహ్నం గ్రామంలో మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ మృతదేహాన్ని దగ్గరి నుంచి చూసి చలించిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న దేవేందర్ మృతదేహాన్ని, ఆయన తలకు తగిలి న గాయాన్ని చూసి భయాందోళనకు గురయ్యాడు. ఇంటికి వెళ్లిన తర్వాత అస్వస్థతకు గురై గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

నర్సంపేటలో అజర హాస్పిటల్ బ్రాంచ్ ప్రారంభం

వరంగల్ మెడికల్, జూలై 8: అజర హాస్పిటల్ బ్రాంచ్‌ను నర్సంపేట పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అజర స్పెషాలిటీ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనతరం అజర హాస్పిటల్ ఎండి.డాక్టర్ బండారు శివసుబ్రమణ్యం మాట్లాడుతూ నర్సంపేట ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఈ బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాజరామ్, డాక్టర్ వి.ఎం.జయుడు, రాజేందర్, రామానంద్, కాంగ్రెస్ పార్టీ సభ్యుడు పాలాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.


అజర బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మేయర్ గుండు సుధారాణి
- ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం


చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 8 : వర్షాకాలంలో ఇంజనీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగాఅమలు చేయాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో వర్షాకాల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా వరంగల్ నగరం వర్షాకాలంలో ముంపుకు గురికాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించిన విషయం తెలిసిందేనని, ఇటీవల హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో సైతం వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని ఆదేశించినట్లు గుర్తు చేశారు. ప్రధాన కార్యాలయంలోని టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4251 980, 97019 99640కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి జేసీబీలను అందుబాటులో ఉంచాలన్నారు. నగరంలోని చెరువులకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేసి, పిల్లర్లు కట్టి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు బీఎల్ శ్రీనివాస్, రాజయ్య, శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్, డీఈలు రవికిరణ్, సంతోష్‌బాబు, సారంగం, శివానంద్‌తో పాటు ఏఈలు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా చూడాలి

నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని 13, 22 డివిజన్లలో స్థానిక కార్పొరేటర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్యాంకుకాలనీ, డాక్టర్స్‌కాలనీ, సీకేఎం కళాశాల మెయిన్ రోడ్డు, లక్ష్మీనగర్, మర్రివెంకటాద్రి కాలనీలలో ముంపునకు గురయ్యే ప్రాంతాలతోపాటు చిన్నవడ్డెపల్లి చెరువు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడారు. గతంలో చిన్నవడ్డెపల్లి చెరువు ప్రాంతంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, గతసమస్య పునారావృత్తం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బస్వరాజు కుమారస్వామి, సురేష్‌జోషిబల్దియా ఏఈ సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


ఉర్సు పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

శంభునిపేట, జూలై 8 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదవాలని ఓరుగల్లు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు మచ్చిక రాజు అన్నారు. సంస్థ ఆధ్వర్యం లో శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం ఉచితం నోట్‌బుక్స్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తాళ్లపల్లి ప్రకాశ్‌గౌడ్, ఉపాధ్యాయులు సిద్దేశ్వర్, దొంతి రఘు, వెంకటేశ్వర్లు, మార్గం నవీన్‌కుమార్, పవిత్ర, మమత, సంస్థ ప్రతినిధి ప్రియాంక పాల్గొన్నారు.

- రంగశాయిపేటకు చెందిన కెంచ కుమారస్వామి-లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఉర్సు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్ ఉచితంగా అందించారు. అమెరికాలో ఉంటున్న కుమారస్వామి కుమారులు నవీన్, ప్రవీణ్‌లు కొన్నేళ్ళుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో కోరె రవీందర్, మండల రసింహారాములు, ఉపాధ్యాయులు డి.పూసారాం, నళిని, వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మీ, నవీన్‌కుమార్, వివేకానంద, చక్రపాణి, హైమావతి, కోమలత పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై జవాబుదారీతనం అవసరం

- కమిషనర్ అశ్విని తానాజి వాకడే
- బల్దియా గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

వరంగల్ కార్పొరేషన్, జూలై 8 : గ్రీవెన్స్ ఫిర్యాదులపై అధికారులకు జవాబుదారితనం అవసరమని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్ నేరుగా ఫిర్యాదులుస్వీకరించారు. ఫిర్యాదులను పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను పిలిచి మాట్లాడారు. ఉదయం నుంచి మధ్యాహ్నం జరిగిన గ్రీవెన్స్‌లో 72 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్ పలాస, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్‌లతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. ఇంజనీరింగ్ - 20, హెల్త్ అండ్ శానిటేషన్ - 04, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 10 టౌన్‌ప్లానింగ్ - 38 ఫిర్యాదులు అందినట్టు అధికారులు తెలిపారు.

నాయకులు దేశాన్ని అమ్ముతున్నారు
- లింగంపల్లి కిషన్‌రావు, ఆగ్రోస్ మాజీ చైర్మన్

దేశంలో కొందరు రాజకీయ నాయకులు దేశాన్ని అమ్ముతున్నారని, దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత దేశ ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఉందని ఆగ్రోస్ మాజీ చైర్మన్ కిషన్‌రావు కమిషనర్‌తో అన్నారు. బల్దియాలో అవినీతి అధికారులపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసి మాట్లాడారు. పోలీసు, రెవెన్యూ శాఖల్లో అవినీతికిపాల్పడిన అధికారులను గుర్తించి వేటు వేస్తుంటే కుడా, బల్దియాలో కొందరు అధికారులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్పొరేషన్ నుంచి ఒక ఇంటి నిర్మాణానికి అనుమతి పొంది ఆరు ప్రాంతాల్లో అదే అనుమతితో కొందరు అక్రమార్కులు దర్జాగా ఇండ్లు నిర్మించినట్టు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. మేడం నగరంలో ఇంటి అనుమతి ఇచ్చే ముందుకు ప్రతీఇంట్లో ఐదు మొక్కలు నాటాలనే ఆంక్షలతో ఇంటి అనుమతులు ఇవ్వాలని చేతులు జోడించి విన్నవించారు.


కమిషనర్‌కు వినతులు సమర్పిస్తున్న ప్రజలు

సెల్‌ఫోన్‌లలో అధికారులు నిమగ్నం

ప్రతీ సోమవారం నగరంలోని ప్రజలు పుట్టెడు ఆశలతో సమస్యలు చెప్పుకునేందుకు బల్దియా కార్యాలయానికి వస్తుంటారు. కానీ వేదికపై, వేదిక ఎదురుగా కొందరు అధికారులు సెల్‌ఫోన్ జపం చేస్తున్నారు. ఎవరి సమస్య తమకేంటని నిర్లక్ష్యంగా కూర్చోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కాగా, వేదిక ముందు ఉన్న అధికారులు కూడా వందలో 80 శాతం మంది వివిధ విభాగాల అధికారులు సెల్‌ఫోన్ మాట్లాడడం, సెల్ ఫోన్ చూస్తూ సమయాన్ని గడిపేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కూర్చున్న వరుసలో కూర్చున్న బల్దియా బయాలజిస్ట్ మాధవరెడ్డి ఏకంగా ప్రజావాణి ముగిసే వరకు వీడియో గేమ్స్ ఆడుతూనే కనిపించింది. పక్కనే ఉన్న అధికారులు అప్రమత్తం చేస్తున్నా సెల్‌ఫోన్‌లో నిమగ్నమై ఉండగా గ్రీవెన్స్ ముగిసింది అని చెప్పే వరకు సెల్ ఫోన్‌లోనే ఉన్నారు. ప్రతీ ప్రజావాణిలో అధికారులు సెల్‌ఫోన్‌లతో కాలం గడపడం యథాతదంగా మారింది. కమిషనర్ అధికారుల తీరుపై దృష్టిపెట్టి ప్రజావాణిలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కళాశాలను అభివృద్ధి చేయాలని సీఎంకు లేఖ

శంభునిపేట, జూలై 8 : నగరంలోని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సామాజిక కార్యకర్త మండల పరశురాములు సోమవారం లేఖ రాశారు. 2008లో ఏర్పాటు చేసినా కళాశాలకు ఇప్పటి వరకు భవనం కేటాయించలేదని, స్థానికంగా ఉండే ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని త్వరగా డిగ్రీ కళాశాలకు నిబంధనల ప్రకారం సొంత భవనాన్ని నిర్మించాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య బండా ప్రకాశ్‌లు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి : అరూరి

ఖిలావరంగల్, జూలై 8: సామాజిక బాధ్యతకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. సోమవారం శివనగర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు నగరంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అరూరి మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ జిల్లా వాసులు పెద్దసంఖ్యలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో 34వ, డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ, నాయకులు చింతల అనిల్, బూత్ అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్, శెట్టి రమేష్, టీపీఎల్ఎన్ శ్రీనివాస్, ఉషారాణి, సాగరిక, స్వరూప, స్రవంతి, కల్పన, ముత్తినేని రవి, విజయ్ పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న అరూరి, గంట రవికుమార్


విద్యార్థి నిఖిల్ వర్మను అభినందిస్తున్న కలెక్టర్

ఇన్‌స్పైర్‌కి ఎంపికైన విద్యార్థిని అభినందించిన కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూలై 8: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన విద్యార్థి బట్టు నిఖిల్ వర్మను కలెక్టర్ సత్య శారదాదేవి సోమవారం కలెక్టరేట్‌లో అభినందించారు. నెక్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నిఖిల్ వర్మ గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని తాను రూపొందించిన వాటర్‌క్లీనర్ బోట్ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు. జాతీయ స్థాయికి ఎంపికైన 26 ప్రాజెక్టులలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎంపిక అయిన ఏకైక విద్యార్థి కావడం విశేషం. కార్యక్రమంలో డీఈవో వాసంతి, సైన్స్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాస్, గైడ్ టీచర్ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల నిరసన

వరంగల్ కలెక్టరేట్, జూలై 8: నాల్గవ తరగతి ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని తెలంగాణ పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల విజయ్ కుమార్ కోరారు. ఇదే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చాగంటి రవి మాట్లాడుతూ ప్రమోషన్లు ఇచ్చిన తర్వాతే బదిలీల ప్రక్రియ మొదలు పెట్టాలని, జీవో 317ను రద్దు చేసి నాల్గవ తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. వీఆర్ఏ, వీఆర్ఓలను పంచాయతీరాజ్ శాఖలో విలీనం చేయడంతో ప్రమోషన్లలో నష్టం జరుగుతుందని వాపోయారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ సత్య శారదాదేవికి అందజేశారు. కార్యక్రమంలో లూనావత్ సంతోష్, అంకుశావలి, మాడుగుల రాజమౌళి, సంతోష్, కుమారస్వామి, బోషవాలి, మైధం కిరణ్, వనజ కుమారి, వసంత, జ్యోతి, రజిత,వజ్రమ్మ,లక్ష్మీ,శంకర్ పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగులు

ఘనంగా వైఎస్సార్ జయంతి

సంగెం, జూలై 8: రాష్ట్రంలో వైఎస్సార్ పాలన అమోఘంగా నడిచిందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పార్టీ చోల్లేటి మాధవరెడ్డి ఆధ్వర్యంలో సంగెంలో జయంతి సందర్భంగా మండలకేంద్రంలోని ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌పాలనలో పలు విప్లవాత్మకమైన నిర్ణయాలనుతీసుకోని అమలు చేశారన్నారు. కార్యక్రమంలో అధికార ప్రతనిధి జనగాం రమేష్, మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, నాయకులు ఆగపాటి రాజు, మద్ద కేశవులు,అచ్చ నాగరాజు, గుళ్లపల్లి చంద్రశేఖర్,అనుముల కుమారస్వామి, ఇండ్ల రవికుమార్, గూడ సంపత్‌రెడ్డి, అప్పల కవిత, ఎండిపాషా, గుండేటి రాజేష్, లక్ష్మణ్‌నాయక్, నర్సింహ పాల్గొన్నారు.

- గిర్మాజిపేట: అన్నివర్గాల సంక్షేమం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వినూత్న పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో సంక్షేమ సారథిగా నిలిచారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి మీసాల ప్రకాష్ అన్నారు. సోమవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా వెంకట్రామ జంక్షన్‌లో కాంగ్రెస్ నాయకులు జంగం ప్రభాకర్, రజితల ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాప్రస్థానం పేరుతో వైఎస్సార్ పాదయాత్ర చేసి ప్రజలను స్వయంగా కలుసుకుని ప్రజా సమస్యలను తెలుసుకుని ఎన్నికల్లో ప్రజాఆదరణతో అధికారం చేపట్టి సంక్షేమ పథకాలు అమలుచేశాడన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, వేణు, నాగరాజ్, సర్దార్ జస్వీర్ సింగ్, అన్వేష్, సదానందం, శ్రీనివాస్, గూడా శారద, రమ్య, శ్యామల పాల్గొన్నారు.


పోచమ్మమైదాన్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్

- పోచమ్మమైదాన్: పోచమ్మమైదాన్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌శ్రేణులు జన్ను పెద్దసుధాకర్, జన్ను ప్రకాశం, ప్రమోదు, యెసోబు, దయానంద్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


నరేష్

గీసుగొండ, జూలై 8 : జాన్‌పాకకు చెందిన 33ఏళ్ల గజ నరేష్ కొద్ది రోజులుగా కనిపించడం లేదని అతని భార్య ఉమ గురువారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... నరేష్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. 10మార్చి 2024న హైదరాబాద్‌కి వెళ్లి అక్కడే డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు భార్యతో మాట్లాడేవాడు. మే 2న భార్యకు ఫోన్ చేసి ఎలక్షన్‌ల వరకు ఇంటికి వస్తానని చెప్పిన నరేష్, ఆ తర్వాత ఆచూకీ లేకుండా పోయింది. అప్పటి నుంచి వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఉమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

కరీమాబాద్, జూలై 8: ఎంజీఎంలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందగా మృతదేహాన్ని మార్చురిలో భద్రపరిచినట్లు సోమవారం మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ఈనెల 4న లేబర్ కాలనీలో విశాల్ మటన్ షాపు వద్ద గుర్తు తెలియని వృద్ధుడు(80) అనారోగ్యంతో మతిస్థిమితం లేక పడి ఉండటంతో గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేసి అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. సంబంధీకులు 87126 85006, 87126 85119 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

చిట్టీల పేరుతో మోసం.. నిందితుల అరెస్టు

కరీమాబాద్, జూలై 8 : నెలవారి చిట్టీల పేరుతో కొందరి నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు నిందితులను మిల్స్‌కాలనీ పోలీసులు సోమవారం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... అండర్ రైల్వేగేటు పెరుకవాడకు చెందిన పుప్పాల రాజేందర్, అతని కుటుంబ సభ్యులు అనుమతులు లేకుండా మహాలక్ష్మీ నెలవారి చిట్టీలను, మహాలక్ష్మీ పరపతి సంఘం పేరుతో 275 మంది సభ్యుల నుంచి డిపాజిట్ల రూపంలో సుమారు రూ.5కోట్ల వరకు వసూలుచేశారు. నెలలు గడుస్తున్నా డబ్బులు తిరిగి సభ్యులకు చెల్లించకుండా వాయిదాలు వేస్తుండటంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి నిందితుడు పుప్పాల రాజేందర్, అతని భార్య, కొడుకు, కూతురుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

మండిబజార్‌లో నడిరోడ్డుపై వాలీబాల్?

మట్టెవాడ, జూలై 8: వరంగల్ మండిబజార్‌లో ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో కొందరు యువకులు రోడ్డుపై వాలీబాల్ ఆడి హల్‌చల్ చేసినట్లు తెలిసింది. మండి బజార్ నుంచి వెళ్లే వాహనాలు ఆపి రోడ్డుపైనే వాలీబాల్ ఆడారు. ఆట పూర్తయిన తర్వాత వెళ్లాలని వాహనదారులను అడ్డుకున్నట్టు సమాచారం. రెండు రోజుల క్రితమే వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, వరంగల్ సబ్ డివిజన్ పోలీసులు మండిబజార్‌లో పెట్రోలింగ్ నిర్వహించారు. నిర్ణీత సమయంలో షాపులు మూసివేయాలని, అర్ధరాత్రి అనవసరంగా రోడ్లపై యువకులు తిరగరాదని, మద్యం మత్తులో వాహనాలు నడుపరాదని హెచ్చరికలు జారీచేశారు. వారి హెచ్చరికలను బేఖాతర్ చేసి యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. అర్ధరాత్రి వరకు బిర్యాని సెంటర్లు, పాన్‌షాపులు తెరిచి ఉంటున్నాయి, మద్యం మత్తులో యువకులు తీరును చూసి భయభ్రాంతులకు గురై డయల్ 100కు కాల్ చేసినట్లు తెలిసింది.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారి

సంగెం, జూలై 8 : మండల ప్రత్యేకాధికారిగా నియమితులైన డీఎల్‌పీవో వేదవతి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి రవీందర్, ఎంపీవో కొమురయ్య పాల్గొన్నారు.

ఫోర్జరీతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు

పోచమ్మమైదాన్, జూలై 8: ప్రభుత్వ ఉద్యోగుల ఫోర్జరీ సంతకాలతో ఓ వ్యక్తి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఘటన వరంగల్ తహసీల్దారు కార్యాలయంలో వెలుగు చూసింది. తహసీల్దారు మహ్మద్ ఇక్బాల్ కథనం ప్రకారం. కొత్తవాడకు చెందిన ఆకారపు మహేందర్‌రెడ్డి ఇటీవల ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకోసం ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల సంతకాలతో కూడిన వాఙ్మూలాన్ని జతపర్చాడు. సంబంధిత రెవెన్యూ అధికారులు విచారణ జరిపి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం తహసీల్దారుకు సిఫార్సు చేశారు. అనుమానం వచ్చి ప్రభుత్వ ఉద్యోగులను ఫోన్ ద్వారా సంప్రదించగా తాము ఎలాంటి సంతకాలు పెట్టలేదని, సదరు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ దరఖాస్తు చేసిన వారెవరో తెలియదని చెప్పినట్లు తహసీల్దారు వెల్లడించారు. దీంతో కింది స్థాయి ఉద్యోగుల మీద ఆగ్రహం వ్యక్తం చేసి, సంబంధిత విచారణ అధికారికి షోకాజు నోటీసులు జారీ చేశారు. ఫోర్జరీ చేసిన వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తహసీల్దారు వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


మొండ్రాయిలో కలుసుకున్న నాటి విద్యార్థులు

సంగెం, జూలై 8: మొండ్రాయిలోని సిద్దార్థ పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 2004-05లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు తీగరాపు సుధాకర్, లెంకలపల్లి మొగిలి, కొనకటి మొగిలి,దుడ్డె వేంకటేశ్వర్లు, కోటగిరి శ్రీనివాస్, పెండ్లి కుమారస్వామి, చంద్రస్వామి, చంద్రమౌళిలను సత్కరించారు.

ఖిలావరంగల్‌లో గ్యాంగ్ వర్క్


డ్రైయినేజీని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఖిలావరంగల్, జూలై 8: ఖిలావరంగల్ 37, 38వ, డివిజన్‌లలో డ్రైయినేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, ముళ్ల పొదలను సోమవారం మునిసిపల్ సిబ్బంది తొలగించారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'కోటలో మౌలిక వసతులు కరువు' కథనానికి స్పందనగా శానిటరి ఇన్‌స్పెక్టర్ నిరంజన్ ఆదేశాల మేరకు జవాన్ హరినాథ్ సోమవారం 37, 38 డివిజన్లలో ముదిరాజ్‌కాలనీ, మధ్యకోటలోని ముస్లింకాలనీలో డ్రైనేజీలను శుభ్రం చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గీసుగొండ/సంగెం, జూలై 8 : అర్హులందరికీ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించటం జరుగుతుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. కొనాయిమాకుల, సంగెం రైతు వేదికలలో కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సోమవారం లబ్ధిదారులకు అందించారు. అనంతరం మాట్లాడుతూ తాను పరకాల ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ఇప్పటి వరకు గీసుగొండ 252 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందించినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న వారికి కూడా చెక్కులను ఇప్పించినట్లు వివరించారు. టెక్స్‌టైల్ పార్కులో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయా కంపెనీలకు స్పష్టం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దిన్, ఆర్ఐ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. గీసుగొండ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, వజ్ర రాజు, రహీంపాష, రాజేశ్వర్‌రావు, నాగరాజు, పత్తిపాక రవిందర్, సుభాష్ పాల్గొన్నారు. సంగెం కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ కౌసల్యదేవి, సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, మాజీ ఎంపీపీ కళావతి పాల్గొన్నారు.


కొనాయిమాకుల లబ్ధిదారులకు చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే రేవూరి

- వనమహోత్సవాన్ని గ్రామాల్లో పండుగలా జరపాలని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కోరారు. సోమవారం కాపులకనపర్తిలో గ్రామ పంచాయతీ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలను నాటారు.



నారుమడిలో కలుపుమందు



కలుపుమందు కొట్టిన నారుమడి

పర్వతగిరి, జూలై 8 : మండలంలోని దౌలత్‌నగర్‌కు చెందిన దద్దు రవి అనే రైతుకు చెందిన నారుమడిలో గ్రామానికి చెందిన కొందరు కలుపుమందు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల తన వ్యవసాయ భూమి వద్ద బోరుబావి స్టార్టర్, డబ్బా, ఫీజులు, ఆటో స్టార్టర్, మోటారు వైరు, సర్వీస్‌వైరు, వాటర్ పైపులు, కప్లింగ్‌లు తదితర వస్తువులను ధ్వంసం చేసి సుమారు రూ.20 వేలు నష్టం కలిగించారన్నారు. దీనిపై అప్పుడే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, కానీ, ప్రస్తుతం నారుమడికి కలుపు మందు పిచికారీ చేయడంతో నారు మొత్తం చనిపోయిందని, దీంతో తనకు రూ.10వేలు వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. అధికారులు, పోలీసులు పరిశీలించి తనకు న్యాయం చేయాలని బాధితరైతు విలపిస్తూ కోరాడు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కొనాయిమాకుల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ/సంగెం, జూలై 8 : అర్హులందరికీ కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందిస్తామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. కొనాయిమాకుల, సంగెం రైతు వేదికలలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సోమవారం లబ్ధిదారులకు అందించారు. అనంతరం మాట్లాడుతూ తాను పరకాల ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ఇప్పటివరకు గీసుగొండ 252 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందించినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న వారికి కూడా చెక్కులను ఇప్పించినట్లు వివరించారు. టెక్స్‌టైల్‌పార్కులో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయా కంపెనీలకు స్పష్టంచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దిన్, ఆర్ఐ సాంబయ్య పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. గీసుగొండ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు శ్రీనివాస్, అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, నాయకులు రాజ్‌కుమార్,వజ్ర రాజు, రహీంపాష, రాజేశ్వర్‌రావు,నాగరాజు, పత్తిపాక రవిందర్, సుభాష్ పాల్గొన్నారు. సంగెం కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ కౌసల్యదేవి, సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, మాజీ ఎంపీపీ కళావతి పాల్గొన్నారు. వన మహోత్సవాన్ని గ్రామాల్లో పండుగలా జరపాలని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కోరారు. సోమవారం కాపులకనపర్తిలో గ్రామ పంచాయతీ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలను నాటారు.

ఇన్‌స్పైర్‌కి ఎంపికైన విద్యార్థికి కలెక్టర్ అభినందన



విద్యార్థి నిఖిల్ వర్మను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, జూలై 8 : జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన విద్యార్థి బట్టు నిఖిల్ వర్మను కలెక్టర్ సత్య శారద సోమవారం కలెక్టరేట్‌లో అభినందించారు. నెక్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నిఖిల్ వర్మ గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని తాను రూపొందించిన వాటర్ క్లీనర్ బోట్ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు. జాతీయ స్థాయికి ఎంపికైన 26 ప్రాజెక్టులలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థి కావడం విశేషం. కార్యక్రమంలో డీఈవో వాసంతి, సైన్స్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాస్, గైడ్ టీచర్ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

నర్సంపేటలో అజర హాస్పిటల్ బ్రాంచ్

ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



అజర హాస్పిటల్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

వరంగల్ మెడికల్, జూలై 8 : అజర హాస్పిటల్ బ్రాంచ్‌ను నర్సంపేట పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమ వారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ- అజర స్పెషాలిటీ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనతరం అజర హాస్పిటల్ ఎండీ డాక్టర్ బండారు శివసుబ్రమణ్యం మాట్లాడుతూ నర్సంపేట ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఈ బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.రాజరామ్, డాక్టర్ వీఎం.జయుడు, రాజేందర్, రామానంద్,కాంగ్రెస్‌పార్టీ సభ్యుడు పాలాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళి



నర్సంపేటలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట, జూలై 8 : ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ బత్తిని రాజేందర్ పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి చింతల సాంబరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకూబ్‌రెడ్డి, మసూద్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు నూనె పద్మ,మాజీ సర్పంచ్ చిలువేరు రజనీ భారతి, పంబి వంశీ, ఆడెపు రమ, లక్ష్మి, జ్యోతి, కాజాబీ, నాడెం నగేశ్, రవి, బానాల శ్రీనివాస్, రమేశ్, భరత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. వరంగల్ రోడ్‌లోని వైఎస్ఆర్ గార్డెన్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ నాడెం శాంతికుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లేపల్లి దినేశ్, నాడెం సారంగం, యుగందర్, శ్రీనివాస్, భాస్కర్, శ్రీను, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ : వైఎస్సార్ జయంతి వేడుకలను ఇల్లందలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు బోంపెల్లి దేవేందర్‌రావు వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, జిల్లా నాయకుడు పోశాల వెంకన్న, నాయకులు బుచ్చిమల్లు, జక్కి గోపాల్, శ్రీనివాస్, పరశురాములు, భాస్కర్ పాల్గొన్నారు.

● దుగ్గొండి: గిర్నిబావిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీచేశారు.

కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగె నర్సింగరావు, మార్కెట్ డైరెక్టర్ దంజ్యానాయక్, ఎస్టీ సెల్ డివిజన్ అధ్యక్షుడు జయరాంనాయక్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సక్కుబాయి, మండల ప్రధాన కార్యదర్శి ఎడెల్లి శ్రీనివాస్‌రెడ్డి ద్యాగం శివాజీ, కొత్తకొండ వర్మ, అమ్మరోహిత్, కోరే రాజేష్, బండారి ప్రకాశ్ పాల్గొన్నారు.

● నెక్కొండ: సూరుపల్లి క్రాస్ రోడ్డు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్‌చేసి పండ్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, సూరుపల్లి గ్రామపార్టీ అధ్యక్షుడు కవి రాజ్, నాయకులు బాస్కర్, సుధాకర్, రాజు, అశోక్, శ్రీనివాస్, గౌతం, శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

● పర్వతగిరి: మండల కేంద్రంలో కాంగ్రెస్, యూత్ కాంగ్రె స్ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, యూత్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనీల్, మాజీఎంపీటీసీ బొట్ల మహేంద్ర, మాజీ జిల్లా కోఆప్షన్ మెంబర్ సర్వర్, నాయకులు కూసం రాంచందర్, మాసాని సువర్ణ, సుల్తానా, గొడుగు భిక్షపతి, నరుకుడు రవీందర్, వెంకన్న, కనకరాజు, ఓరుగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● సంగెం : ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ పాలన అమోఘంగా నడిచిందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండల పార్టీ చోల్లేటి మాధవ రెడ్డి ఆధ్వర్యంలో సంగెంలో వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, పేదలకు పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో అధికార ప్రతనిధి జనగాం రమేష్, మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, నాయకులు ఆగపాటి రాజు, మద్ద కేశవులు, నాగరాజు, చంద్రశేఖర్, కుమారస్వామి, ఇండ్ల రవి కుమార్, గూడ సంపత్‌రెడ్డి, కవిత, పాష, రాజేష్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.



నెక్కొండలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోలీసుల అదుపులో అనుమానితులు

రహీంపాషా హత్యకు ప్రేరేపించిన విషయాలపై ఆరా

నర్సంపేట టౌన్, జూలై 8 : పట్టణంలోని పాఖాల్‌రోడ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బెల్టుషాపు నిర్వాకుడు షేక్ రహీంపాషా ఆదివారం తన ఇంటి ఆవరణలోని బావిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన పాఠకులకు విధితమే. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినప్పటికీ సంఘటనా ప్రదేశంలో లభించిన ఆధారాలు, స్థానికుల అనుమానాలతో రహీంపాష మృతి కేసును హత్య కోణంలో పోలీసులు వేగవంతంగా విచారణచేపడుతున్నారు. గంజాయి మత్తులో కొంతమంది యువకులే రహీంపాషాను కొట్టి చంపి బావిలో పడేసి ఉంటారా? హత్యకు ప్రేరేపించిన ఇతర కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. నర్సంపేట పట్టణంతో పాటు మండలంలోని రెండు, మూడు గ్రామాల్లో నిందితుల కోసం గాలింపులు చేపట్టిన పోలీసులు, కొంత మంది అనుమానిత యువకులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పట్టణంలో చెలరేగుతున్న గంజాయి బ్యాచ్

బెల్టు షాపు నిర్వాహకుడి అనుమానాస్పద మృతితో స్థానిక ప్రజల్లో భయాందోళనలు రేకెత్తుతున్నాయి. గత కొద్ది రోజులుగా నర్సంపేట పట్టణంలో గంజాయిసేవించే యువకులు బ్యాచ్‌లుగా తయారై పట్టణ శివారు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని గంజాయి, మద్యం సేవిస్తూ చుట్టు పక్కల గృహవాసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి యువతకు విక్రయిస్తున్నట్లువిశ్వసనీయ సమాచారం. గంజాయిసేవించిన వారిని గతంలో పోలీసులు పట్టుకొని తూతూ మంత్రంగా కౌన్సెలింగ్‌ఇచ్చి వదిలేస్తుండడంతో గంజాయి బ్యాచ్‌లు పట్టణంలో పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా గంజాయి బ్యాచ్‌ల భరతం పట్టడంతో పాటు గంజాయి సరఫరా చేస్తున్న వారిని పట్టుకొని శిక్షించాలని యువజన సంఘాల బాధ్యులు పోలీసులను కోరుతున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



యశోదమ్మ(ఫైల్)

పర్వతగిరి, జూలై 8 : మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు మోటుపల్లి యశోదమ్మ (101) ఆదివారం మృతి చెందారు. మండల కేంద్రంలోని తన ఇంట్లోనే పాఠశాలను ప్రారంభించి ప్రాథమిక స్థాయి విద్యను పర్వతగిరి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలవారికి ఉచితంగా అందించారు. ప్రస్తుతం రాజకీయంగా, ఉద్యోగాలపరంగా వివిధ హోదాల్లో ఉన్న వారు యశోదమ్మ వద్ద ఓనమాలు నేర్చుకోవడం గమనార్హం. యశోదమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని యశోదమ్మ ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఆమె హైదరాబాద్‌లో కూతురి ఇంట్లో ఉంటున్నారు. యశోదమ్మ మరణవార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పలువురు గ్రామస్థులు ఆమె సేవలను గుర్తుచేసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పర్వతగిరి,జూలై 8 : మండలంలోని అన్నారంషరీఫ్‌లో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అరెస్టుచేసినట్లు ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి గుండా నాగేందర్ అనే వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి గ్రామానికి చెందిన రాపోలు యాకయ్య, ఎస్‌కె.రియాజ్, డికొండ కుమార్, కొండ వెంకన్న, ఎమ్డీ.అమ్జద్‌పాషాలను అరెస్టుచేసినట్లు తెలిపారు. ఇంటి యజమాని గుండా నాగేందర్ పరారీలో ఉన్నాడని తెలిపారు. అరెస్టుచేసిన వారి వద్దనుంచి రూ.12,020 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాడి గేదెల దాడిలో పాలేరు మృతి



యశోదమ్మ(ఫైల్)

వర్ధన్నపేట, జూలై 8: పాడిగేదెల దాడిలో పాలేరుకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన వర్ధన్నపేటలో చోటు చేసుకుంది. వర్ధన్నపేటఎస్సై ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. వర్ధన్నపేటకు చెందినతోట జనార్ధన్ (59), అదే గ్రామానికి చెందిన గుజ్జ సోమేశ్వర్‌రావు పాడి గేదెలను మేపడానికి పాలేరుగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 6న వాటిని మేపుకొని ఇంటికి తరలిస్తున్న క్రమంలో రెండు పాడి గేదెలు దాడి చేసిన ఘటనలో జనార్ధన్‌కు గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున తోట జనార్ధన్ మృతి చెందాడు. పాడిగేదెలు దాడి చేయడంతో మృతి చెందాడని మృతుడి కూతురు దీప్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు. ఒక కూతురికి వివాహం కాగా, మరో కూతురు డిగ్రీ చదువుతున్నది.

ఎస్సై మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

నర్సంపేట టౌన్, జూలై 8 : ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారణమైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య డిమాండ్ చేశారు. సోమవారం నర్సంపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సై మృతికి కారణమైన సీఐ జితేందర్‌రెడ్డిని, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కుల వేధింపులకు గురవుతున్న బాధితులు ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. ఈ సమావేశంలో అంకేశ్వర్‌రావు, రమేష్, ఫైడి, అసీనాబేగం, రజిత, రాజు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నర్సంపేట, జూలై 8 : నర్సంపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తగూడ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థినిలకు సోమవారం పట్టణంలోని ఆ క్లబ్ కార్యాలయంలో సైకిళ్లను పంపిణీ చేశారు. కొత్తగూడ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన తాళ్ల జస్మిత, రాసాల వైష్ణవి, ఆవుల కీర్తన, తీగల అమూల్య, రాదారపు పూజితలకు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇర్కు కోటేశ్వర్‌రావు, అధ్యక్షుడు బాదం రంజిత్‌కుమార్, కార్యదర్శి విబూది శివకుమార్‌లు క్లబ్ సభ్యులతో కలిసి సైకిళ్లను పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో పేద విద్యార్థులను ఐదుగురిని విద్యార్థినిలను గుర్తించి వారికి పాఠశాలలకు వెళ్లేందుకు సైకిళ్లను అందజేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు మోతె జైపాల్‌రెడ్డి, సాదినేని శ్రీలక్ష్మి, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, శ్రీరాం కిరణ్, పాలకుర్తి శ్రీనివాస్, చకిలం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు భవనాల పరిశీలన

దుగ్గొండి, జూలై 8 : మండలంలోని నాచినపల్లి, తొగర్రాయి గ్రామాల్లోని జీపీ భవనాలను మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు సోమవారం ఏపీడీ రేణుకా దేవి పరిశీలనచేశారు. మండలంలోని నాచినపల్లి, తొగర్రాయి, తిమ్మంపేట, మహ్మదాపురం, లక్ష్మిపురం, వెంకటాపురం గ్రామాలకు మీ సేవా కేంద్రాలు మంజూరయ్యాయని వెల్లడిం చారు. త్వరలో నోటిఫికేషన్‌తో ఆపరేటర్లుగా అర్హులైన మహిళలను ఎంపికచే స్తామన్నారు. పరిశీలనలో ఏపీఎంలు అనిత, రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఎల్‌వీ సంతాప సభను విజయవంతం చేయండి

● ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య

నర్సంపేట, జూలై 8 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ నెల 9న జరుగనున్న కార్మిక ఉద్యమ నాయకుడు ఎల్.విశ్వనాథ్ సంతాప సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టియూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య పిలుపు నిచ్చారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఎల్‌వీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. విశ్వనాథం మృతి ఆదివాసీ గిరిజన, ప్రజాసంఘాలకు తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో బోడ మంచ్యా, గుగులోతు నాగేశ్వర్‌రావు, శంకర్, మాలోతు వసంతరావు, వెంకన్న, రమేశ్, రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల వనమహోత్సవం

పర్వతగిరి, జూలై 8 : మండలంలోని ఏనుగల్లు గ్రామ పశువైద్యశాల ఆవరణలో సోమవారం బీజేపీ నాయకులు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. బీజేపీ జిల్లా నాయకుడు కర్నె రవీందర్ పార్టీ నాయకులతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్లు, నాయకులు తొర్రి లక్ష్మణ్, భిక్షపతి, దేశిరాం, కానుగంటి శంకరయ్య, పెండ్యాల సత్యనారాయణ, కర్నె శ్రీనివాస్, రాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ



విద్యార్థులకు గుర్తింపుకార్డులు, నోటు బుక్స్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట టౌన్, జూలై 8 : మండలంలోని కమ్మపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచితంగా గుర్తింపు కార్డులు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దూపటి సరిత మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో పాటు ఉపాధ్యాయులు సొంతంగా నోటుబుక్స్, గుర్తింపు కార్డులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సర్దార్, సీఆర్‌పీ దూపటి చంద్రమౌళి, ఉపాధ్యా యులు వసంతరాణి, కవితలు పాల్గొన్నారు.

'రక్తం-రక్తదానం' పుస్తకావిష్కరణ

నర్సంపేట టౌన్, జూలై 8 : నర్సంపేట పట్టణంలోని సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్ 7వ వార్షికోత్సవ సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గొంగళ్ల అశోక్ మాట్లాడుతూ బాలల అభివృద్ధి కోసం సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి ఉత్తమ యువజన అవార్డులను అందుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం సంఘమిత్ర సలహాదారు పెన్మత్స సుబ్బ రాజు రచించిన రక్తం-రక్తదానం అనేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమలో తోట రవి, ప్రశాంత్, రాణి, రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న హెచ్‌ఎం మహేష్ నాయక్

వర్ధన్నపేట రూరల్, జూలై 8 : విద్యార్థులు పాఠశాల నుండే అవకాలను అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని హెచ్‌ఎం మహేష్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో జననీ ఫౌండేషన్ నిర్వాహకులు ఇనుకొండ రోహిణి రెడ్డి మనోజ్‌రెడ్డి దంపతులు, రాకేష్, సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు, పాఠశాల సామగ్రిని పంపిణీ చేశారు. అంతకు ముందు 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ ర్యాంకు సాధించిన స్వర్ణలతకు రూ.15వేలు, ద్వితీయ ర్యాంకు సాధించిన సీహెచ్ శ్రీవాణికి రూ.10వేలు ఆర్థికసాయం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బక్కతట్ల హైమా, ఉపాధ్యాయులు సదానందం, సంపత్ కుమార్, ఇందిరా, కవిత, వినోద్ కుమార్, సోమయ్య, నరేందర్ పాల్గొన్నారు.

బీసీ కులాల ఐక్యవేదిక ఏర్పాటు

పర్వతగిరి, జూలై 8 : మండలంలోని చింతనెక్కొండలో బీసీ కులాల ఐక్యవేదికను సోమవారం హితకారిణి సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటికె మల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటుచేశారు. అధ్యక్షుడిగా గటికె మల్లయ్య, కన్వీనర్‌గా బోనాల సాంబయ్య, కోకన్వీనర్లుగా కుడికాల వెంకటేశ్వర్లు, దెంచినాల వెంకటేశ్వర్లు, సభ్యులుగా గాద్దుల సంపత్, ఇద్దం దూడయ్య, పుట్ట స్వామి, శివరాత్రి వెంకటేశ్వర్లు, ఓరుగంటి దేవేందర్, ఆవుల సంపత్, గటికె స్వామి, నాగెల్లి వెంకటేశ్వర్లు, రాచకొండ అశోక్‌లను ఎన్నుకున్నారు.

రెండో ఎస్సైగా రాజు బాధ్యతల స్వీకరణ

వర్ధన్నపేట, జూలై 8: వర్ధన్నపేట పోలీసుస్టేషన్ రెండో ఎస్సైగా ఎం.రాజు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఎం.రాజు ఎస్ఐబీ హైదరాబాద్ నుంచి వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై రాజుకు మొదటి ఎస్సై ప్రవీణ్‌కుమార్ మొక్కను అందించిన అభినందనలు తెలిపారు.

మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయాలి

వర్ధన్నపేట, జూలై 8 : కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు కర్క సోమిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం ముందు బీజేపీ నేతలు ఆందోళన చేశారు. అనంతరం వర్ధన్నపేట తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల వ్యవసాయ రుణాన్ని మాఫీచేయాలని, రైతు భరోసా పేరుతో రూ.15 వేల పెట్టుబడిని రైతులకు అందించాలని, కౌలు రైతులకు అందిస్తానన్న రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తానని చెప్పిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రాయపురం కుమారస్వామి, నాంపల్లి యాకయ్య, సంపత్‌రెడ్డి, పెద్దూరి రాజ్‌కుమార్, కొండేటి సత్యం, సుభాష్, విక్కీ, సిద్ధం శ్రీనివాస్, కూనూరు ఎల్లస్వామి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఫర్జానాకు 23వ ర్యాంక్



దుగ్గొండి, జూలై 8 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2023 సెప్టెంబర్‌లో హిందీ జూనియర్ లెక్చరర్ పోస్టులకు పరీక్షలు నిర్వహించగా, సోమవారం వెలువడిన ఫలితాల్లో మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండీ. ఫర్జానా 23వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఫర్జానా మాట్లాడుతూ 450 మార్కులకు గాను 313.672 మార్కులు పొందినట్లు తెలిపారు. కాగా, ఆమె ప్రస్తుతం చెన్నారావుపేటలోని ఎస్సీ సోషల్ వెల్ఫేర్ గురుకులంలో హిందీ టీచర్‌గా పని చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హాసిని



హాసినిని అభినందిస్తున్న హెచ్‌ఎం

పర్వతగిరి, జూలై 8 : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని రోళ్లకల్లులోని ఆర్డీఎఫ్ పాఠశాల విద్యార్థిని ముక్కెర హాసిని ఎంపికైనట్లు హెచ్‌ఎం బాషబోయిన రాములు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం జరిగిన ఉమ్మడి వరంగల్ అథ్లెటిక్స్ కాంపిటీషన్‌లో అండర్-10 విభాగంలో వంద మీటర్లలో పాల్గొన్న హాసిని రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా హాసినిని హెచ్‌ఎంతో పాటు ప్రైమరీ స్కూల్ ఇన్‌చార్జ్ జె.బాలరాజు, పీఈటీ సురేష్, సునీల్ అభినందించారు.

భూ పట్టాలు అందించాలని ఆదేశించడంపై హర్షం

చెన్నారావుపేట, జూలై 8 : నిరుపేదలకు సంబంధించిన వ్యవసాయ భూములకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పట్టాలను అందించడానికి ఆదేశించడంపై మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండంలోని ఎల్లాయిగూడెం, జల్లి, మాధవనగర్ కాలనీ తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామాల్లోని రైతలకు సర్వే నెంబర్ 70లో వ్యవసాయ భూములున్నాయన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలకు భూములు కేటాయించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి పోర్టల్‌లో రైతుల భూములను అటవి భూములుగా నమోదు చేయడంతో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారన్నారు. ఈ సర్వే నెంబర్‌లో ఉన్న భూములకు ఇందిరమ్మ పేరిట తిరిగి పట్టాదారు పాసు పుస్తకాలను అందించడానికి కృషిచేస్తానని రైతులకు భరోసా కల్పించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు రూపిక శ్రవణ్, బాదావత్ బాలు, అంబల రవి. చిల్పూరి వీరస్వామి. మంచాల సారయ్య, గంధం బాలరాజుగౌడ్. రూపిక వెంకన్న, సుమన్, బిట్ల శ్రీను, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.